బూర్జ డిపోలోనే ఎండిఎం బియ్యం ఇవ్వాలి

ఎంఇఒకు వినతిపత్రం ఇస్తున్న సిఐటియు నేతలు

ప్రజాశక్తి -హుకుంపేట: బూర్జ పంచాయతీ తుంబవలస గ్రామం పాఠశాల మధ్యాహ్నం భోజన బియ్యాన్ని బూర్జ పంచాయతీ డిపోలోనే ఇవ్వాలని సిఐటియు జిల్లా అధ్యక్షుడు తమర్భ అప్పలకొండ పడాల్ కోరారు. మంగళవారం తుంబవలస గ్రామస్తులతో కలిసి, ఎంఇఒకు వినతిపత్రం అందజేశారు. తుంబవలస పంచాయతీ కేంద్రం బూర్జలో రేషన్‌డిపో ఉన్నప్పటికీ, తుంబవలస పాఠశాల ఎండిఎం బియ్యాన్ని ఏడు కిలోమీటర్ల దూరంలో ఉన్న మజ్జివలస డిపోలో ఇస్తున్నారని, దీంతో బియ్యం తెచ్చుకునేందుకు ఎండిఎం నిర్వాహకులు ఇబ్బందులు పడుతున్నారన్నారు తక్షణమే తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఎండిఎం నిర్వాహకురాలు కొర్రా కాసులమ్మ పాల్గొన్నారు.

10న రాష్ట్ర గవర్నర్ అరకు పర్యటన

పద్మాపురం గార్డెన్‌లో గవర్నర్ పర్యటన ఏర్పాట్లపై సూచనలిస్తున్న పిఒ అభిషేక్

ప్రజాశక్తి- అరకులోయ : ఈనెల 10న రాష్ట్ర గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్ అరకు పర్యటన ఏర్పాట్లను ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి వి. అభిషేక్ మంగళవారం పరిశీలించారు. గవర్నర్ పర్యటించమన్న సందర్శనా స్థలాలను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ, ఈనెల 10న అరకులోయకు చేరుకొని పద్మాపురం గార్డెన్ ట్రీ క్యాస్టిల్‌ను గవర్నర్ సందర్శిస్తారు. అక్కడ నుండి మ్యూజియమును సందర్శిస్తారు. అనంతరం సుంకరమెట్ట కాఫీ ప్లాంటేషన్ తిలకిస్తారుతరువాత పెదలబుడు గిరి గ్రామదర్శినిని సందర్శిస్తారన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేసి గవర్నర్ పర్యటనను విజయవంతం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ వి.మురళి, తహశీల్దార్ వేణుగోపాల్, ఎంపిడిఒ నగేష్, గిరిజన సంక్షేమ శాఖ ఇఇ వేణుగోపాల్, డిఇఇ సుబ్బారావు, మ్యూజియం క్యూరేటర్ ఎన్. మురళి, పద్మాపురం గార్డెన్ మేనేజర్ బొంజుబాబు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి ప్రతిష్టను పెంచాలి

- గిరిజన బిడ్డలను ఉన్నతులుగా తీర్చిదిద్దాలి
- గురువులకు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ ఉపదేశం
- 60 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం

ఎటిడబ్ల్యుఒ రజనిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్ ఐటిడిఎ పిఒ

ప్రజాశక్తి - పాడేరు: ఉపాధ్యాయ వృత్తికి మరింత ప్రతిష్ట పెంచేవిధంగా జిల్లాలోని ఉపాధ్యాయులందరూ విద్యాభివృద్ధికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక కాఫీ హౌస్‌లో జాతీయఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి జిల్లా కలెక్టర్‌తోాటు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి అభిషేక్, డీఈవో సలీం భాషాపూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లాలో ఉత్తమ సేవలు అందించిన 60 మంది ఉపాధ్యాయులకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులతో సత్కరించారు. ప్రశంసాపత్రాలు జ్ఞాపికలు అందజేశారు.
ఈ సందర్భంగాకలెక్టర్ మాట్లాడుతూ ఏజెన్సీలో పనిచేయడం ఉపాధ్యాయులకు ఒక ఛాలెంజ్ అని, దీన్ని అదృష్టంగా భావించాలన్నారు. ఏజెన్సీలోని ప్రతి ఉపాధ్యాయుడూ సన్మానం పొందడానికి అర్హులని, ఆ స్థాయిలో వారు సేవలు అందించడం అభినందనీయమన్నారు. ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ గిరిజన బిడ్డలు ఉన్నత స్థానంలో నిలవాలనిఉపాధ్యాయులే కీలకం కావాలన్నారు. సమాజంలో ఉన్నతమైన స్థానానికి చేరుకోవాలన్నా, గొప్ప ఉద్యోగాలలో స్థిరపడి గౌరవం పొందుతున్నారన్నా ఉపాధ్యాయుల కృషి ఎంతో ఉందన్నారు. ఐటిడిఎప్రాజెక్టు అధికారి అభిషేక్ మాట్లాడుతూ సమాజంలో చాలా గౌరవప్రదమైన, బాధ్యతాయుతమైన ఉద్యోగం ఉపాధ్యాయ వృత్తేనన్నారు. పోటీప్రపంచంలో ఉన్నతంగా రాణించే విధంగా ఉత్తమ ప్రమాణాలతో కూడిన నాణ్యమైన, క్రమశిక్షణతో కూడిన విద్యను అందించి భావితరాల బంగారు భవిష్యత్తుకు బాటవేయాలన్నారు. విద్యార్థుల్లో దాగివున్న ప్రతిభ సామర్థ్యాలను వెలికితీసే శక్తి కేవలం ఉపాధ్యాయులకే ఉందన్నారు. గిరిజన ప్రాంతంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులందరికీ గురుపూజోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పాడేరు ఎంపిపి ఎస్.రత్నకుమారి, ఎటిడబ్ల్యుఒలు, ఎంఇఒలు, హెచ్‌ఎంలు, సన్మానగ్రహీతలు పాల్గొన్నారు.

విఒఎల సమస్యలను పరిష్కరించాలని ధర్నా

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

వెలుగు విఒఎలు (యానిమేటర్స్) ఉపాధికి నష్టం కలిగించే సర్క్యులర్‌ను రద్దు చేయాలని, దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాజవొమ్మంగి వెలుగు కార్యాలయం వద్ద మంగళవారం వెలుగు యానిమేటర్లు సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. తమ డిమాండ్ల పరిష్కరించాలని పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు పుట్టా రామరాజు మాట్లాడుతూ, దీర్ఘకాలంగా యానిమేటర్స్ చెల్లించాల్సిన బకాయిలను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్వయం సహాయక సంఘాల ఏర్పాటులో ప్రధాన భూమిక పోషించే యనిమేటర్ల జీతభత్యాల చెల్లింపులో తీవ్ర నిర్లక్ష్యం చేస్తోందన్నారు. మహిళా సంఘాల స్వయం సహాయక సంఘాల బలోపేతానికి యానిమేటర్ల కృషిని గుర్తించి వారికి చెల్లించాల్సిన జీతాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వెలుగు యానిమేటర్ సంఘం నాయకులు చిన్నతల్లి, కె వెంకటరమణ, శ్రీను, ఈసర్లమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిపి కారం లక్ష్మి

వ్యాధుల పట్ల అప్రమత్తం

- ఎంపిపి కారం లక్ష్మి

ప్రజాశక్తి-విఆర్.పురం

వ్యాధులు పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని ఎంపీపీ కారం లక్ష్మి వైద్య సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం రేఖపల్లిలోని ఎండిఓ కార్యాలయంలో ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వర్షాకాలం వచ్చిన నేపథ్యంలో గిరిజన గ్రామాల్లో అంటు రోగాలు ప్రబలకుండ ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని, వ్యాధిగ్రస్తులకు తక్షణ వైద్య సేవలు అందించాలని సూచించారు. రాయిగూడెం, రేఖపల్లి పిహెచ్‌సిల పరిధిలో మలేరియా కేసులు, డెంగ్యూ జ్వరాలు అధికంగా నమోదవుతున్న నేపథ్యంలో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పంచాయతీల సహకారంతో గ్రామాల్లో ఫాగింగ్ చేపట్టి దోమలను నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఆశా కార్యకర్తలు ప్రతి కుటుంబం వద్దకు వెళ్లి యోగక్షేమాలు తెలుసుకోవాలని, వ్యాధిగ్రస్తులను వెంటనే ఆసుపత్రికి తీసుకురావాలని సూచించారు. ప్రతి గ్రామంలో హెల్త్ క్యాంపులు నిర్వహించాలన్నారు. రేఖపల్లి, రాయిగూడెం పిహెచ్‌సిల పరిధిలో ఖాళీగా ఉన్న ఆశా పోస్టులను భర్తీ చేయాలని వైద్యాధికారులను కోరారు.

దారి మూసేయడంపై ఆందోళన

సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన చేస్తున్న గిరిజనులు

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: అభివృద్ధి పేరుతో అంజోడ సిల్క్‌ఫారం రోడ్డును ఇనుప కంచెలు వేసి దారి మూసేయడాన్ని నిరసిస్తూ ఆ గ్రామస్తులు సిపిఎం ఆధ్వర్యంలో సిల్క్ ఫారం వద్ద మంగళవారం ఆందోళన చేపట్టారు. మండలంలోని కొర్రాయిపంచాయతీ శాంతినగర్, తోకవలస గ్రామస్తులు ఈ రోడ్డును రాకపోకలకు వినియోగిస్తున్నారు. ప్రస్తుతం మూసేయడంపై ఇబ్బందులు పడే పరిస్థితి ఉంది.

ఈ సందర్భంగా సిపిఎం మండల ప్రధానకార్యదర్శి ఎస్‌బి పోతురాజు మాట్లాడుతూ, ప్రనజలు రాకపోకలకు ఉపయోగించే రోడ్డును అభివృద్ధి పేరుతో కంచెలు వేసి పూర్తిగా మూసేయడం సరికాదని, ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని తక్షణమే కంచెను తొలగించి, యథవిధిగా రాకపోకలకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. గిరిజనులను ఇబ్బందులు పెడితే తీవ్ర పరిణామాలుంటాయని హెచ్చరించారు.

గిరిజనుల ఆందోళనపై ఫారెస్ట్ రేంజర్ శ్రీనివాస్ స్పందిస్తూ సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పడంతో, గిరిజనులు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు టి సూర్యనారాయణ, సిపిఎం నాయకులు పి సురేషకుమార్, పి సత్యనారాయణ, చైర్మన్ భారతి, గ్రామస్తులు జి సురేషకుమార్, జి అర్జున్, వి మహాదేవ్, మితుల గోరమ్మ పాల్గొన్నారు.

గిరిజనేతరుడికి ఎస్‌టి కుల ధ్రువీకరణ!

- బాధ్యులైన వ్యక్తి, అధికారులపై చర్యలు చేపట్టాలి
- ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాలదేవ్

బోగస్ కులధ్రువీకరణలు చూపుతున్న నేతలు

ప్రజాశక్తి- అరకులోయ : మండలంలోని పెదలబుడు గ్రామపంచాయతీ సచివాలయం-1 పరిధిలోని అరకులోయ టౌన్ షిప్ కొండవీధికి చెందిన కాపు (బిసి డి) కులానికి చెందిన పిట్టల రాంబాబుకు అరకులోయ తాహశీల్దార్ కార్యాలయం నుండి ఎస్‌టి 'భగత' కుల ధ్రువీకరణ పత్రం జారీ చేశారని ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి బాలదేవ్, మండల నాయకులు టి. హరి,కే. జగన్నాథం, కె.సహదేవ్ విమర్శించారు. మంగళవారం ఆదివాసీ గిరిజన సంఘం భవనంలో విలేకరుల సమావేశంలో రాంబాబు పొందిన బోగస్ కులధ్రువీకరణను చూపించారు.

ఈ సందర్భంగా బాలదేవ్ మాట్లాడుతూ, గిరిజనేతరుడైన కాపు, బిసి డీ కులానికి చెందిన రాంబాబుకు ఈ ఏడాది మే 29న, ఎస్‌టి కుల ధ్రువీకరణ పత్రం ఎలా మంజూరు చేశారో రెవెన్యూ అధికారులు, సచివాలయ సిబ్బంది సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పెదలబుడు పంచాయితీ అరకువేలి టౌన్‌షిప్‌లో గిరిజనేతరులు రెవిన్యూ అధికారులకు ముడుపులు చెల్లించి నకిలీ కుల ధ్రువీకరణ పత్రాలు పొందుతున్నారని ఆరోపించారు. పిట్టల ఇంటి పేరుతో ఆదివాసి భగత తెగలో అరకులోయ మండలంలోని 14 పంచాయితీల పరిధిలో ఎవరూ లేరన్నారు.

బోగస్ కులధ్రువీకరణ పొందిన రాంబాబుపైనా, అందుకు సహకరించిన రెవెన్యూ, సచివాలయ సిబ్బందిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని, బాధ్యులైన అధికారులపై శాఖాపరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. జగనన్న సురక్ష అంటూ ఇబ్బడిముబ్బడిగా ఇంటింటికీ వెళ్లి 11 రకాల సర్టిఫికెట్లను జారీ చేశారని, వీటిల్లో ఇంకెన్ని బోగస్, నకిలీలు ఉన్నాయో అంతుపట్టడం లేదన్నారు. దీనిపై జిల్లా కలెక్టర,పిఒ సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

అధికారుల నిర్లక్ష్యం వల్లే కూలిన ప్రహరీ

- బాలికల హాస్టల్‌లోకి చొరబడిన వర్షపునీరు
- పుస్తకాలు, బట్టలు తడిసిపోవడంతో ఇక్కట్లు

కూలిన ప్రహరీని పరిశీలిస్తున్న ఆదివాసీ గిరిజన సంఘం నేతలు

ప్రజాశక్తి - హుకుంపేట : మండల కేంద్రంలో సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి జూనియర్ కళాశాల బాలికల వసతిగృహం ప్రహరీ గోడ కూలిపోయింది .వసతి గహనికి అనుకొని వున్న కల్వర్టు మూసుకుపోవడంతో ,ప్రధాన డ్రైనేజీకి వచ్చే వరద నీరు హాస్టల్‌లోకి చొరబడడం వల్లే ప్రహరీ కూలిపోయిందని స్థానికులు అంటున్నారు. విషయం తెలిసిన వెంటనే ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు టి కృష్ణారావు, గిరిజన మహిళాసంఘం జిల్లా నాయకురాలు హైమావతి సంఘటనాస్థలికి వెళ్లి పరిశీలించారు. హాస్టల్ మేట్రిన్, విద్యార్థులతో మాట్లాడి ప్రహరీ కూలిపోవడానికి గల కారణలు అడిగి తెలుసుకున్నారు.

రాత్రి కురిసిన భారీ వర్షానికి భారీగా నీరు లోపలికి వచ్చేసిందని, డార్మెటరీ, స్టాక్‌రూమ్‌లోకి నీరు చొరబడడంతో విద్యార్థుల పుస్తకాలు, బట్టలతోపాటు సరుకులన్నీ తడిసిపోయాయని విద్యార్థులు వివరించారు.దీంతో మేట్రిన్ సాయంతో వేరే స్కూల్‌లో బస పొందామన్నారు.

బాలికల హాస్టల్‌లో సమస్యలను పలమార్లు కలెక్టర్,పిఒ, డిపిఒ, ఎంపిడిఒ, ఇతర అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారు సకాలంలో స్పందించకపోవడం వల్లే దాదాపు 280మంది విద్యార్థులు ఇబ్బందులు పడే పరిస్థితి ఉందని ఆవేదన, ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా స్పందించి, బాలిక హాస్టల్‌లో సమస్యలను పరిష్కరించాలని కోరారు.

గుట్టుగా రంగురాళ్ల తవ్వకాలు

జోగులపోటు గ్రామ పరిసర కొండల్లో రంగురాళ్ల తవ్వకం ఆనవాళ్లు

ప్రజాశక్తి-జి మాడుగుల: మండలంలోని జోగులుపోటు గ్రామ సమీప కొండల్లో వారం రోజులుగా గుట్టుచప్పుడు కాకుండా రంగురాళ్ల తవ్వకాలు జరుగుతున్నాయి. దీనికి అనవాలుగా అక్కడ కొండల వద్ద మట్టిని భారీగా తవ్వుతున్నట్లు గోతులు దర్శనమిచ్చాయి. మైదాన ప్రాంతానికి చెందిన వ్యాపారస్తులు వీటిని కొనుగోలు చేసేందుకు వస్తున్నట్టు సమాచారం. దీనిపై సంబంధిత అధికారులు నిఘాపెడితే పూర్తి వివరాలు తెలిసే అవకాశం ఉంది.

కూరగాయల సరఫరాకు టెండర్లు ఖరారు

మాట్లాడుతున్న గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ జాన్‌రాజ్

ప్రజాశక్తి -రంపచోడవరం

ఏజెన్సీలోని రంపచోడవరం, చింతూరు డివిజన్ల పరిధిలోని 11 మండలాల్లో ఉన్న గిరిజన ఆశ్రమం పాఠశాలు, కళాశాలలలో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన కూరగాయలు, అరటి పండ్లు సరఫరాకు సంబంధించి తక్కువ ధరకు వేసిన టెండర్లను పరిశీలించి టెండర్లు ఖరారు చేయడం జరుగుతుందని రంపచోడవరం గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాన్ రాజ్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఐటీడీఏ సమావేశపు హాలులో ఏటిడబ్ల్యుఓలతో డిప్యూటీ డైరెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11 మండలాల్లోని 21 పాఠశాలలు, కళాశాలలకు 60మంది, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని 125 ఆశ్రమ స్కూళ్లకు 18 మంది టెండర్లు వేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏటిడబ్ల్యుఓలు రామ తులసి, కే సుజాత, హాసిని, జల్లి చెంబుడు, గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయ పరిపాలన అధికారి బి.కిషోర్, గురుకుల పాఠశాలల ప్రిన్సిపాళ్లు ఎలీషా, ప్రసన్న, పార్వతి, సీనియర్ అసిస్టెంట్లు చక్రధర్, రమణి, టెండరుదారులు పాల్గొన్నారు.

అతిథి ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-రంపచోడవరం

రంపచోడవరం, చింతూరు ఐటీడీఏల పరిధిలోని ఏకలవ్య మోడల్ స్కూళ్లలో 2023-24 విద్యా సంవత్సరంలో అతిథి ఉపాధ్యాయులుగా పనిచేయుటకు ఆసక్తి, అర్హత కలిగిన రిటైర్డ్ ఉపాధ్యాయులు, ఇతర డిపార్ట్మెంట్లో పనిచేసిన జూనియర్ లెక్చలర్ల నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు రంపచోడవరం, చింతూరు ఐటిడిఎల పిఒ సూరజ్ గనోరే మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సిఎంఆర్ఎస్ రాజవొమ్మంగి, అడ్డతీగల, రంపచోడవరంలో టీజీటీ తెలుగు1, మ్యాథమెటిక్స్ 2, ఇంగ్లీషు 2, సోషల్ 2, సైన్స్ 1 పోస్టులు, ఈఎంఆర్ఎస్ చింతూరు, రాజవొమ్మంగిలో పిజిటిలకు మ్యాథమెటిక్స్ 2, ఇంగ్లీష్ 1, ఫిజిక్స్ కెమిస్ట్రీ 2, హిస్టరీ 2, పాలిటిక్స్ 2 పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. దేశంలోని అన్ని ఏకలవ్య మోడల్ స్కూల్ విద్యాసంస్థల్లో శాశ్వత ప్రాతిపదికన ఉద్యోగ నియామకాలకు నోటిఫికేషన్ విడుదలైనందున శాశ్వత ఉద్యోగ నియామకం జరిగేంతవరకు మాత్రమే అతిథి ఉపాధ్యాయులను తీసుకోవడం జరుగుతుందని వెల్లడించారు. అర్హతలు రిటైర్డ్ ఉద్యోగులు, ఇతర డిపార్ట్మెంట్లో పనిచేసిన జూనియర్ లెక్చరర్ నుండి ఈ -మెయిల్ ద్వారా ఈ నెల 7 నుండి 14వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరిస్తామని తెలిపారు. ఆసక్తి గలవారు rsg.yrm@gmail.com మెయిల్‌కు పంపించాలన్నారు. పూర్తి వివరాల కోసం ఎస్.రామకృష్ణ, ఫోన్ నెంబర్ 9490876026ను సంప్రదించాలని కోరారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి -సీలేరు

ఆంధ్ర- ఒరిస్సా సరిహద్దు నుంచి విజయవాడకి గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను మంగళవారం పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక ఎస్సై రామకృష్ణ కథనం ప్రకారం.... ఆంధ్ర ఒరిస్సా సరిహద్దుల్లో గంజాయిని కొనుగోలు చేసి విజయవాడకు అక్రమంగా తరలిస్తున్నట్లు ముందస్తు సమాచారంతో స్థానిక ఐటిఐ జంక్షన్ వద్ద పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో ఇద్దరు వ్యక్తులు 10 కేజీలు గంజాయిలతో రెండు మోటార్ సైకిళ్లపై వెళుతుండగా పోలీసులు గమనించి వారిని వెంబడించి పట్టుకున్నారు. మరో వ్యక్తి పరారయ్యాడు. పట్టుబడిన ఇద్దరు నిందితుల నుండి 10 కేజీలు గంజాయి, రెండు మోటార్ సైకిళ్లు, రూ.550 నగదు స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. నిందితులు విజయవాడకు చెందిన షేక్ మాబు, సుభాని బైక్‌లు దొంగతనాలు చేసి, వాటిపై ఏజెన్సీ ప్రాంతానికి వచ్చి సీలేరు పంచాయతీ చింతపల్లి గ్రామానికి చెందిన వంతల మూర్తి వద్ద సహాయంతో గంజాయి కొనుగోలు చేసి ద్విచక్ర వాహనంపై విజయవాడ అక్రమ రవాణా పాల్పడుతున్నట్లు తమ విచారణ వెల్లడైందని ఎస్ఐ తెలిపారు. విచారణ అనంతరం నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

పట్టుబడిన గంజాయి, నిందితులతో పోలీసులు

గ్రామసభలో సర్వే జాబితాను చూస్తున్న ఎంపిటిసి పూనెం ప్రదీప్‌కుమార్

కన్నాయిగూడెంలో గ్రామసభ

ప్రజాశక్తి -విఆర్.పురం

పోలవరం నిర్వాసితుల ఇళ్ల గుర్తింపునకు మండలంలోని కన్నాయిగూడెం గ్రామంలో మంగళవారం గ్రామసభ నిర్వహించారు. పోలవరం ఇళ్ల సర్వేకు సంబంధించి పేపర్ ప్రకటనలో 10 ఇళ్ళు సర్వే లిస్టులో లేని కారణంగా మళ్లీ సర్వే చేయాలని సిపిఎం ఆధ్వర్యం చింతూరులోని ఉన్నతాధికారులకు దరఖాస్తులు ఇచ్చిన నేపథ్యంలో వెంటనే అధికారులు స్పందించి ఇళ్లకు గుర్తింపునకు గ్రామ సభ ఏర్పాటు చేశారు. డిప్యూటీ తహశీల్దారు, సీనియర్ అసిస్టెంట్ వచ్చి లిస్టులో లేని ఇళ్లకు పూర్తి ఆధారాలు తీసికొని సర్వే చేశారు. ఈ సందర్భంగా స్థానిక ఎంపిటిసి పూనెం ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ ఏ ఒక్క ఇల్లు మిస్ కాకుండా చూడాలని కోరారు. ఈ నేపథ్యంలో ఎంపీటీసీ ప్రదీప్ కుమార్‌కి గ్రామ పెద్దలు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు బిమయ్య, బొర్ర ముత్యాలు రాముడు, రాజు చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

'భవిష్యత్తుకు గ్యారెంటీ'పై ప్రచారం

ప్రజాశక్తి మారేడుమిల్లి

బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా మండలం సున్నంపాడు గ్రామంలో మంగళవారం ఇంటింటికి తిరుగుతూ రిజిస్ట్రేషన్ చేయడం జరిగింది. ఇందులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే సీతంశెట్టి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి వస్తే తల్లికి వందనం పేరుతో ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉన్న ప్రతి ఒక్కరికి రూ.15000 చొప్పున అందించనున్నట్లు, ఆడబిడ్డ నిధి కింద 18 ఏళ్ల నిండిన ప్రతి స్త్రీకి నెలకు 1500 అందుతాయని, దీపం పేరుతో ప్రతి సంవత్సరం కుటుంబానికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తారని, జిల్లాలో ప్రతి మహిళకు ఉచితంగా బస్సు ప్రయాణం కల్పిస్తారని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండల నాయకులు గురుకు శేష కుమార్, పోడియం శ్రీనుబాబు, అందాల సూర్యనారాయణ రెడ్డి, కంగల కన్నప్పదొర, బీసెట్టి అప్పాజీ, జిఎంలస ఎంపిటిసి కొరగాని సువర్ణ రాజు, పేథకం శెట్టి రాము, ఏరుబండి రాంబాబు, రేవుల జానకి రెడ్డి, కంగల వెంకటేశ్వర్లు, కుంజం ముత్తన్న దొర, పోడియం కన్నపుదొర, సారపు నరసింహపు దొర, మడకం వెంకటేష్ దొర, మడి చిన్నాలుదొర తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

ఘనంగా గురుపూజోత్సవం

బదిలీ ఉపాధ్యాయులను సత్కరిస్తున్న తల్లిదండ్రులు

ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం

డుంబ్రిగుడ: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని పోతంగి పంచాయితీ రంగినివలస ప్రాధమిక పాఠశాలలో పనిచేసి, ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు యుటిఎఫ్ జిల్లా కౌన్సిలర్ ఎస్ కన్నయ్య, ఎస్.రాజులను ఆ పాఠశాల విద్యార్థులతల్లిదండ్రులు దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం వారు గ్రామంలో చేసిన అభివృద్ధిని కొనియాడారు. స్థానిక స్కూల్ కాంప్లెక్స్‌లో సుందరరావు అధ్యక్షతన సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.సంజీవరావు, యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి ఎస్ బాలకష్ణ, ఎం మోహనరావు, సిఆర్‌పిలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అనంతగిరి : క్షేత్రస్థాయిలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి, వారిని ఉన్నతులుగా తీర్చిదిదాదల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని జెడ్‌పిటిసి దీసరి గంగరాజు అన్నారు. మంగళవారం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కొత్తూరు కస్తూర్బా పాఠశాలలో ఎంఇఒ కె.బాలాజీ ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులను సత్కరించారు.కార్యక్రమంలో ఎటిడబ్ల్యూఒ. వెంకటరమణ, ఉపాధ్యాయులు. వివి ఈశ్వరరావు, మల్లేశ్వరరావు, సన్యాసిరావు, బిఎస్‌ఎన్‌ఎల్ పాడల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు

అరకులోయ:నియోజకవర్గ కేంద్రమైన అరకులోయలో డాక్టర్ సర్వేపల్లి రాధాకష్ణన్ జయంతిని పురస్కరించుకుని గురుపూజోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎంఇఒ వి.త్రినాధరావు ఆధ్వర్యంలో స్థానిక సిఎహెచ్.స్కూల్‌లో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవంలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన సీనియర్ ఉపాధ్యాయులు పి.సీత, సెమో, రమణ, అద్దులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఇఒ- 2 భారతరత్నం, యుటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు టి. చిట్టిబాబు పాల్గొన్నారు. మండలంలో వివిధ పాఠశాలలు, కళాశాలల్లో గురుపూజోత్సవ వేడుకల్లో ఘనంగా నిర్వహించారు. ఉత్తమ ఉపాధ్యాయులను హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా డాక్టర్ విజయ డానియల్ మోడీ, శెట్టి దిలీప్,మర్దోను రమేష్, కిల్లో దాసులు పాల్గొని ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు.

అరకులోయ శారదా నికేతన్‌లో కేక్ కట్‌చేస్తున్న ప్రిన్సిపల్ బి చిరంజీవి

పెదబయలు : మండలంలో పలు పాఠశాలల్లో మాజీ రాష్టపతి సర్వేపల్లి రాధాకష్ణన్ జయంతి, ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగానిర్వహించారు. పెదబయలులో సర్వేపల్లి చిత్రపటానికి ప్రిన్సిపల్ డిఎస్.శంకరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు ఉపాధ్యాయ అవతారం ఎత్తి, ఉపాధ్యాయులకు వివిధ క్రీడలు నిర్వహించారు. ఉపాధ్యాయ వృత్తి నుంచి రాష్ట్రపతి స్థాయికి సర్వేపల్లి ఎలా ఎదిగారు విద్యార్థులకు ప్రిన్సిపల్ శంకరరావు వివరించారు. అనంతరం ఉపాధ్యాయులను 9,10 తరగతుల విద్యార్థులు ఘనంగా సన్మానించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

జి.మాడుగుల :టీచర్స్ డే సందర్భంగా మండలానికి చెందిన పలువురు ఉపాధ్యాయులు అవార్డులు అందుకున్నారు. అవార్డులు అందుకున్న వారిలో ఎంఇఒ బాబూరావు, బూసిపల్లి ఎంపిపిఎస్ ఉపాధ్యాయుడు వి.బొంజుబాబు, కుంబిడిసింగి జిపిఎస్‌ఉపాధ్యాయుడు రత్నం, గాంధీనగర్ జిటిడబ్ల్యూ పాఠశాల హెచ్‌ఎం పి.సుభద్రమ్మ, పెదలోచలి సిఆర్‌పి ఎల్. వీరభద్రమ్మ ఉన్నారు.

పాడేరు టౌన్: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం పాడేరు తలారిసింగి జిటిడబ్ల్యూ ఆశ్రమ పాఠశాలలో పాడేరు ఐటిడిఎ పరిధిలోని జిటిడబ్ల్యూ ఆశ్రమ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న సీనియర్ హెచ్‌ఎంలకు, ఉపాధ్యాయులకు ఎపిటిడబ్ల్యూటియు రాష్ట్ర, జిల్లా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. హెచ్‌ఎంలు రీమలి జాన్, పి.బుల్లయ్య, జి.పండునాయుడు, ఉపాధ్యాయులు పినాగేశ్వరరావు, కె.కేశవరావు, కె.వెంకటరమణ, బి.గణపతిరాజులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. టిడబ్ల్యూ విద్యకు వారు చేసిన సేవలను కొనియాడారు.కార్యక్రమంలో టిడబ్ల్యూటియు రాష్ట్ర నాయకులు ఆర్.సూర్యనారాయణ, పి.కష్ణారావు, కుర్తాడి రామారావు, యు.అర్జున్, జివివి ప్రసాద్, ఎస్.నాగభూషణం నాయుడు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.నీలకంఠం, ఎం.శోభన్ బాబు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు అభినందన

జి.మాడుగుల: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జి.మాడుగుల మండలం గాంధీనగరం పాఠశాల హెచ్‌ఎం పెద్దింటి సుభద్రమ్మ జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును మంగళవారం అందుకున్నారు. జిల్లా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ సుమిత్‌కుమార్, ఐటిడిఎ పిఒ అభిషేక్ నుంచి అవార్డుస్వీకరించారు. ఈ సందర్భంగా సుభద్రమ్మ మాట్లాడుతూ, విద్యార్థులకు, పాఠశాల అభివృద్ధికి తాను చేసిన సేవలను గుర్తించి అవార్డును ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ అవార్డు తన బాధ్యతను మరింత పెంచిందన్నారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును స్వీకరించిన సుభద్రమ్మను పాఠశాల సిబ్బందితో పాటు పలువురు అభినందించారు

అరకు వేలి శారద నికేతన్ పాఠశాలలో....

అరకులోయ రూరల్: మండల కేంద్రంలోని శారద నికేతన్ పాఠశాలలో ప్రిన్సిపల్ బి చిరంజీవి ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్‌చేసి విద్యార్థులు, ఉపాధ్యాయులకు పంచిపెట్టారు సర్వేపల్లి రాధాకష్ణన్ చిత్ర పటానికి జ్యోతి ప్రజ్వలన చేసి, పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు డి నాగలక్ష్మి ,కష్ణ కుమారి ,విజయ్ కుమార్, ధనున్ జయ్ రావు ,కుమారి, సంధ్య ,విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న మ్యాజిక్

అరకులోయ: గురుపూజోత్సవం సందర్భంగా సోబోయి బాపూజీ అనే గిరిజన ఉపాధ్యాయుడు సిఎహెచ్ స్కూల్‌లో మ్యాజిక్‌షో అందరికీ ఆకట్టుకంది. ఒకపక్క ఉపాధ్యాయ వృత్తిని చేస్తూనే మరోపక్క మెజీషియన్‌గా తర్ఫీదు పొంది అందర్నీ ఆనందింప చేస్తున్న బాపూజీని మండల విద్యాశాఖ అధికారులు, తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

రంపచోడవరం : ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ మంగా బొజ్జయ్య ఆధ్వర్యంలో మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఈవోపిఆర్డి జాన్ మిల్టన్, పంచాయతీ కార్యదర్శి ఎన్ రమేష్, సచివాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

స్థానిక ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు డి ప్రేమ్‌కుమార్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలవేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కడబాల రాంబాబు, బి రాంబాబు, బుల్లయ్య, సుగంధర్ రెడ్డి, రమేష్ ,అర్జునుడు, చిన్నారావు, పోతురాజు, సోమేశ్ కుమార్, రణదీప్, సత్యనారాయణ, వార్డెన్ వెంకన్న దొర, విద్యార్థులు పాల్గొన్నారు.

అనంతగిరిలో మాట్లాడుతున్న జెడ్‌పిటిసి గంగరాజు

మండలంలోని కె.ఎర్రంపాలెం ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు వై.లక్ష్మి సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలవేశారు. అనంతరం హెచ్‌ఎంను విద్యార్థినులు శాలువాతో సత్కరించారు. విద్యార్థినులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహాలక్ష్మి, భాగ్యలక్ష్మి, కనకవల్లి, నరసాయమ్మ పాల్గొన్నారు.

రాజవొమ్మంగి : మండలంలోని బోర్నగూడెం గిరిజన ఆశ్రమ పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఎజ్రాశాస్త్రి, ఉపాధ్యాయులు బొడారపు కృష్ణ మాట్లాడారు. అనంతరం పాఠశాల హెచ్‌ఎం ఎజ్రా శాస్త్రి, రిటైర్డ్ హెచ్‌ఎంలు రాజకుమార్, భూషణంలను పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు.

కొయ్యూరు : మండలంలోని పాఠశాలల్లో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సర్వేపల్లికి ఘనంగా నివాళులర్పించారు. విద్యార్థులు ఉపాధ్యాయ అవతారం ఎత్తారు. ఉపాధ్యాయులకు వివిధ క్రీడా పోటీలు నిర్వహించారు. 9, 10 చదువుతున్న విద్యార్థులు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

పాడేరులో ఉపాధ్యాయులకు సత్కారం

నేరాలు ఘోరాలు

50 లీటర్లు సారా పట్టివేత

- ఆరుగురు నిందితుల అరెస్ట్

ప్రజాశక్తి -జి మాడుగుల : 50 లీటర్ల సారాయితో ఆరుగురు వ్యక్తులను పట్టుకుని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. వివరాలివి. ముందస్తు సమాచారం మేరకు రచ్చపల్లి గ్రామం వద్ద పోలీస్ సిబ్బందితో మాటువేసి నిఘాపెట్టగా, సోమవారం రాత్రి అన్నవరం నుండి జి.మాడుగుల వైపు వస్తున్న జీపులో 50 లీటర్ల సారాయి పట్టుబడిందన్నారు ఈ సందర్భంగా ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్టు ఎస్ఐ తెలిపారు దొరికిన నిందితులను జి మాడుగుల కొత్తూరు గ్రామానికి చెందిన తాగుల భానుప్రసాద్, ఎస్ రాజకుమార్, పెదలంక గ్రామానికి చెందిన కె.రాజారావు, ఉరుము గ్రామానికి చెందిన కె పెద్దలక్ష్మయ్య, బుర్రతాడే గ్రామానికి చెందిన జగ్గం దొర, సహదేవుడు జి.మాడుగుల గ్రామానికి చెందిన అబ్దుల్ సాహెబ్ సుల్తాన్‌గా గుర్తించారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండుకు తరలించినట్టు తెలిపారు.నల్లబెల్లం, నాటుసారా అమ్మకం, రవాణాపై ప్రత్యేక నిఘా ఉందని, పట్టుబడితే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్ఐ శ్రీనివాస్ హెచ్చరించారు.

జగన్ పాలనకు జనం ప్రశంసలు : ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

ప్రజాశక్తి -పాడేరు :జగనన్న పాలనకు దేశమంతటా ప్రశంసలు లభిస్తున్నాయని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి అన్నారు.మంగళవారం చింతలవీధి గ్రామ సచివాలయం పరిధిలోని గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని, 272 గడపలను సందర్శించి ప్రజా సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. నాలుగున్నరేళ్లలో అందించిన సంక్షేమ పథకాల వివరాలను పూర్తిగణాంకాలతో ప్రజలకు వివరించారు. స్థానికులు తెలియజేసిన సమస్యల పరిష్కారాన్ని కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం మాట్లాడుతూ. బడుగు బలహీన వర్గాల ఆర్థిక సామర్థ్యాల పెంచే దిశగా సిఎం జగన్ సంక్షేమ పథకాలను అమలు చేశారన్నారు కార్యక్రమంలో సర్పంచ్ వంతల సీతమ్మ, వైస్ సర్పంచ్ తామర సురేష్ , ఎంపిటిసి గిడ్డి విజయలక్ష్మి, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి సీదరి మంగ్లన్న దొర, వ్యవసాయ సలహా మండల చైర్మన్ సరస్వతి, మండల అధ్యక్షులు సీదరి రాంబాబు, ఎఎంసి చైర్మన్ కూతంగి సూరిబాబు, జిల్లా పంచాయతీ విభాగం అధ్యక్షులు గబ్బాడి చిట్టిబాబు, వైస్ ఎంపిపి కుంతూరు కనకాలమ్మ , సర్పంచులు వంతల రాంబాబు, గొల్లోరి నీలకంఠం, ఎంపిటిసిలు కుంతూరు నరసింహమూర్తి, లకే రామకృష్ణ పాత్రుడు, చల్లా చిట్టెమ్మ, దూసురి సన్యాసిరావు, సచివాలయం కన్వీనర్లు మినుముల కన్నాపాత్రుడు, గబ్బాడ రాజారావు, వంతల నరేష్, కొర్ర సుశీల, మండల ఉపాధ్యక్షులు పసుపుల సత్యనారాయణ, సీనియర్ నాయకులు కుంతూరు రాజబాబు, బోనంగి రమణ, సోమెల బోడిరాజు, కొండాజీ, నాని ,కొండమ్మ, అల్లాడ నగేష్, మోద బాబురావు, పిట్ట నవీన్ పాల్గొన్నారు

గిరిజన ప్రాంతానికి ఈ-ఆటోలు అందించండి

ప్రజాశక్తి- అరకులోయ: గిరిజన ప్రాంతంలో తడిపొడి చెత్తలను సేకరణకు ఇ-ఆటోలను అందించాలని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ సమావేశంలో డైరెక్టర్ శోభ సోమేశ్వరి కోరారు. మంగళవారం విజయవాడలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ గంధం చంద్రుడు, చైర్‌పర్సన్ దేవసేన ఆధ్వర్యంలో జరిగిన 23వ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ సమావేశంలో ఆమె పలు అంశాలపై ప్రస్తావించారు. వివరాలను ఫోను ద్వారా తెలియజేశారు. తడి,పొడి చెత్త సేకరణకు ట్రైసైకిల్ ఇవ్వడం వల్ల ఏజెన్సీ ప్రాంతంలో ఉపయోగం లేదని, వాటికి బదులుగా పారిశుధ్య కార్మికులకు ఇ-ఆటోలు అందించాలని కోరానన్నారు ఇప్పుడిప్పుడే అభివద్ధి చెందుతున్న పర్యాటక ప్రదేశాల్లో సామూహిక మరుగుదొడ్ల నిర్మాణానికి సహకరించాలని కోరారు. బొర్రా గుహలు, అరకు లోని గిరిజన మ్యూజియం, లంబసింగి, వంజంగి వంటి పర్యాటక ప్రాంతాలతో పాటు, జిల్లాలో మండల కేంద్రాల వద్ద సామూహిక మరుగుదొడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. క్లాప్ మిత్రలకు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నుంచి జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.ఆయా సమస్యలను సమావేశంలో ప్రస్తావించడంతోపాటు లిఖితపూర్వకంగా మేనేజింగ్ డైరెక్టర్ గంధం చంద్రుడికి వినతి త్రాలను కూడా సమర్పించినట్లు తెలపారు.

ఈ -ఆటోలు, 52 మరుగుదొడ్లు మంజూరు

బోర్డ్ ఆఫ్ మీటింగ్‌లో సోమేశ్వరి ప్రస్తావించిన పలుసమస్యలపై మేనేజింగ్ డైరెక్టర్ గంధం చంద్రుడు, చైర్‌పర్సన్ దేవసేన సానుకూలంగా స్పందించారని, ఏజెన్సీలో అవసరమైన 52చోట్ల మరుగుదొడ్లు మంజూరు చేశారన్నారు. ఈ- ఆటోలు మంజూరు చేస్తున్నట్లు ఎండీ ప్రకటించారన్నారు. తన అభ్యర్థనకు సానుకూలంగా స్పందించడంపై స్వచ్ఛాంధ్ర డైరెక్టర్ శోభా సోమేశ్వరి హర్షం వ్యక్తం చేశారు.

ఆసుపత్రి పనితీరును అడిగి తెలుసుకుంటున్న సురేష్ బాబు

నరసాపురం పిహెచ్‌సి సందర్శన

ప్రజాశక్తి-రంపచోడవరం : మండలంలోని నరసాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పోక్స్‌పేట పంచాయతీ ఉప సర్పంచ్ కారం సురేష్ బాబు మంగళవారం సందర్శించారు. మలేరియా, టైఫాయిడ్, రక్తహీనత సమస్యలతో బాధపడుతున్న వారి వివరాలు పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ షర్మిలను అడిగి తెలుసుకున్నారు. గత వారం కంటే ఈ వారంలో రోగులు తక్కువగానే ఉన్నారని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ రక్తహీనతతో బాధపడుతున్న రోగులు ఉంటే వారికి అందుబాటులో ఉండి తగు సూచనలు చేసి వారు రికవరీ అయ్యేవరకు బాధ్యత తీసుకోవాలని వైద్య సిబ్బందికి సూచించారు.

కన్వీనర్లు, గృహ సారథులతో సమావేశం

ప్రజాశక్తి-రంపచోడవరం : మండలంలోని సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులతో స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఇందులో వైసిపి మండల కన్వీనర్ జల్లేపల్లి రామన్ దొర, మండల సచివాలయాల కన్వీనర్ పండా రామకృష్ణ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వారిని సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు సన్మానించారు. ఈ సందర్భంగా పండా రామకృష్ణ మాట్లాడుతూ రాబోయే 2024 ఎన్నికల్లో మరింత మెజార్టీతో వైపిపి గెలవడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.

మదర్ థెరిసాకు ఘన నివాళి

ప్రజాశక్తి-అడ్డతీగల : మదర్ థెరిసా వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ఉన్న మదర్ థెరిసా విగ్రహానికి పూలదండలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ మానవత్వానికి నిలువెత్తురూపం థెరిసా అని పేర్కొన్నారు. ఆమె సేవాగుణం ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలన్నారు. అనంతరం జనసేన పార్టీ అడ్డతీగల మండలం కమిటీ ఆధ్వర్యంలో పులిహార పంపిణీ చేశారు. కార్యక్రమంలో సురేష్, శివ, జనసేన పార్టీ నాయకులు కుప్పాల జయరాం, పొడుగు సాయి, ప్రసాదు, బాబి, అప్పాజీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు దంగేటి సత్తిబాబు పాల్గొన్నారు.

ప్రభుత్వ రంగాన్ని రక్షించుకుంటాం

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ సహా ఇతర ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ బారి నుంచి పోరాటాలతో కాపాడుకుంటామని సిఐటియు కంచరపాలెం జోన్ కార్యదర్శి ఒ.అప్పారావు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు మంగళవారానికి 889వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో సిఐటియు కంచరపాలెం జోన్ నాయకులు కూర్చున్నారు. వారినుద్దేశించి అప్పారావు మాట్లాడుతూ విశాఖ నగరం అన్ని విధాలా అభివృద్ధి చెందడానికి ఇక్కడున్న ప్రభుత్వ రంగ సంస్థలే కారణమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఈ సంస్థల ద్వారా ఏటా కోట్ల రూపాయల ఆదాయం వస్తున్న విషయాన్ని గుర్తుచేశారు.

ప్రభుత్వ రంగ సంస్థలు ఉండబట్టే రిజర్వేషన్లు అమలు జరిగి దళిత, గిరిజనులకు, మహిళలకు, వికలాంగులకు ఉద్యోగావకాశాలు దక్కాయన్నారు. గాజువాక ప్రాంతం తలసరి ఆదాయంలో ముందుందని తెలిపారు. ఉత్తరాంధ్ర యువతకు ప్రభుత్వ రంగ సంస్థలు పెద్ద ఎత్తున ఉద్యోగావకాశాలు కల్పించాయన్నారు. అలాంటి పరిశ్రమలు ప్రైవేటుపరమైతే ప్రజానీకానికి తీవ్ర నష్టం కలుగుతుందని అన్నారు. కార్యక్రమంలో సంఘం కంచరపాలెం జోన్ అధ్యక్షులు బి.సింహాచలం, నాయకులు ఎస్.రామగోపాల్, కె.ధర్మరాజు, పి.మూర్తి, ఎం.ఈశ్వరరావు, డి.ప్రకాష్, ఎస్.ప్రవీణ్ పాల్గొన్నారు.

గురువులతోనే మెరుగైన సమాజం

రాష్ట్ర స్థాయి ఉపాధ్యాయ వేడుకల్లో వక్తలు - 196 మందికి అవార్డులు, ఘన సత్కారం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : గురువులతోనే మెరుగైన సమాజం సాధ్యమని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, పంచాయతీరాజ్ శాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడు, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని పురస్కరించుకొని తలపెట్టిన రాష్ట్ర స్థాయి ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు మంగళవారం విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీ కట్టమంచి రామలింగా రెడ్డి కన్వెన్షన్ హాల్‌లో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల సంక్షేమానికి ఎంతగానో కృషి చేస్తోందన్నారు. విద్యార్థులను క్రమశిక్షణగల భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని అన్నారు. ఉపాధ్యాయులంతా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చూపిన మార్గంలో నడవాలని ఆకాంక్షించారు. ఒక విద్యార్థి ప్రతిభావంతుడై ఎదిగితే అతనితో పాటు అతని కుటుంబం మొత్తం వృద్ధిలోకి వస్తుందని, కుటుంబ గౌరవం పెరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో భీమిలి శాసన సభ్యులు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, పాఠశాల విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్, ఉన్నత విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జె.శ్యామలరావు, స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ ఎస్.సురేష్ కుమార్, ఎపిఎస్ సిహెచ్ఇ చైర్మన్ హేమచంద్రారెడ్డి, ఆంధ్రా యూనివర్సిటి వైస్ ఛాన్సలర్ పివిజిడి.ప్రసాద్ రెడ్డి, నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, పార్లమెంటు సభ్యులు బివి.సత్యవతి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లేపల్లి సుభద్ర, శాసనమండలి సభ్యులు వరుదు కల్యాణి, డాక్టర్ వేపాడ చిరంజీవి, సమగ్రశిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు, సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ నాగరాణి, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లిఖార్జున పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ

అవార్డులు ఇలా..

అనంతరం 196 మందికి రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలను అందజేశారు. ఈ అవార్డులలో స్కూల్ ఎడ్యుకేషన్ కేటగిరీలో 65 మంది, ప్రొఫిషియన్సీ ఇన్ ఇంగ్లీష్ విభాగంలో 10 మంది, నేషనల్ అవార్డు ఆస్పిరెన్స్ విభాగంలో ముగ్గురు, కెజిబివి కేటగిరీలో ఆరుగురు, ఎపి మోడల్ స్కూల్ కేటగిరీలో ఇద్దరు, ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ విభాగంలో 26 మంది, టెక్నికల్ ఎడ్యుకేషన్ విభాగంలో 10 మంది, ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ విభాగంలో ఎనిమిది మంది, కాలేజ్ ఎడ్యుకేషన్ విభాగంలో 21 మంది, ఇంజినీరింగ్ ఫార్మసీ కళాశాలల విభాగంలో ఐదుగురు, హయ్యర్ ఎడ్యుకేషన్ విభాగంలో 40 మంది ఉపాధ్యాయులను సత్కరించారు. వేడుకల్లో విద్యార్థులు తమ కళారూపాలను ప్రదర్శించి అందరినీ ఆకట్టుకున్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

విఆర్.పురంలో సామూహిక సీమంతాలు నిర్వహిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-కొయ్యూరు

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని శరభన్నపాలెం సర్పంచ్ కిముడు సత్యనారాయణ అన్నారు. మండలంలోని శరభన్నపాలెం అంగన్వాడీ కేంద్రంలో పోషకాహార మాసోత్సవం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోషకాహారం లోపంతో కలిగే అనర్థాల గురించి తెలియజేశారు. గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిటీసీ ఎల్.సోమగాంధీ, సెక్టార్ సూపర్వైజర్ కొండమ్మ, సచివాలయ మహిళా పోలీసు పి.సాయి గంగాభవాని పాల్గొన్నారు.

విఆర్.పురం : అంగన్వాడీ కేంద్రాల్లో ఇచ్చే అదనపు ఆహారం తీసుకోవడం వల్ల పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని బాలల హక్కుల కమిషన్ మాజీ సభ్యులు వి.గాంధీ బాబు అన్నారు. ఐసిడిఎస్ వారు నిర్వహించే పోషకాహార మాసోత్సవాలు విఆర్ పురం ఎస్టీ కాలనీ అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం నిర్వహించారు. విఆర్ పురం సెక్టార్, రేఖపల్లి సెక్టార్ పరిధిలోని అంగన్ వాడీ కేంద్రాల నుండి గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలు హాజరైయారు. గర్భిణులకు సామూహిక శ్రీమంతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ పి.నాగలక్ష్మి, సూపర్వైజర్ జి. రామలక్ష్మి, స్థానిక సర్పంచ్ సోడి నరసమ్మ, ముత్యాల భవాని, జీఎంఎస్‌కే సభ్యులు స్వాతి, అనిత, సాయికుమారి, అంగన్వాడి టీచర్లు, హెల్పర్లు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

జి.మాడుగుల మండలంలోని బొయితిలి పంచాయతీ మద్దిగరువు అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం పోషకాహార వారోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక సర్పంచ్ మాలన్న మాట్లాడుతూ చిన్న పిల్లలకు, గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వపరంగా అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగంచేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిటిసి అప్పలరాజు, అంగన్వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు, ఆయాలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు

ర్యాలీ నిర్వహిస్తున్న నిరుద్యోగులు

జాబ్ కేలండర్ ఎక్కడ ?

- విశాఖ నగరంలో నిరుద్యోగులు భారీ ర్యాలీ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేయాలంటూ మంగళవారం ఉదయం ఎంవిపి కాలనీ సమతా కళాశాల నుంచి ఎఎస్.రాజా కళాశాల వరకూ నిరుద్యోగులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఎపి ఉద్యోగ పోరాట సమితి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు మాట్లాడారు. జాబ్ కేలండర్ ఎక్కడని ప్రశ్నించారు. జిఒ నెంబర్ 98ని రద్దు చేయాలని, గ్రూపు - 2 ఉద్యోగాలను పెంచాలని డిమాండ్ చేశారు. ఆనాడు పాదయాత్రలో జాబ్ కేలండర్ పేరిట జగన్ గొప్పగా ప్రకటనలు చేశారని, హామీలు ఇచ్చారని, అవన్నీ నేడు ఏమయ్యాయని మండిపడ్డారు. నిరుద్యోగులను నట్టేట ముంచి మోసం చేసిన ఆయనకు రానున్న కాలంలో తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. గ్రూప్ - 1, గ్రూప్ - 2 పోస్టులను వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నిరుద్యోగ జెఎసి కన్వీనర్ సిద్ధు, కో - కన్వీనర్ పవన్ కుమార్ యాదవ్ పాల్గొన్నారు.

విశాఖ సిపిగా రవి శంకర్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ నగర పోలీస్ కమిషనర్‌గా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిపార్టుమెంట్‌లో అడిషనల్ డైరెక్టర్ జనరల్‌గా పనిచేస్తున్న 1994 ఐపిఎస్ బ్యాచ్‌కు చెందిన ఎ.రవి శంకర్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్.జవహర్ రెడ్డి మంగళవారం ఉదయం ఉత్తర్వులు జారీ చేశారు. ఐదు నెలలుగా విశాఖ పోలీస్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న 2005 ఐపిఎస్ బ్యాచ్‌కు చెందిన సిఎం త్రివిక్రమ్ వర్మను ఐజిగా స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్సు విభాగానికి బదిలీ చేశారు. అలాగే విశాఖపట్నం నగర లా అండ్ ఆర్డర్ డిసిపిగా విధులు నిర్వహిస్తున్న 2016 ఐపిఎస్ బ్యాచ్‌కి చెందిన వాసన్ విద్యాసాగర్ నాయుడును గ్రేహౌండ్స్ ఎస్‌పిగా బదిలీ చేశారు. అతని స్థానంలో అనంతపురం ఎస్‌పిగా పని చేస్తున్న కంచి శ్రీనివాసరావును విశాఖపట్నం నగర లా అండ్ ఆర్డర్ డిసిపిగా నియమించారు. నగర పోలీస్ కమిషనర్ సిఎం త్రివిక్రమ్ వర్మ, డిసిపి విద్యాసాగర్ నాయుడు ఏప్రిల్ మొదటి వారంలో ఒకేసారి బదిలీపై విశాఖకు వచ్చి ఒకేసారి బదిలీ వెళ్లడం గమనార్హం.

విద్యారంగానికి క్రెడాయి సేవలు ప్రశంసనీయం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ, ముఖ్యంగా విద్యా రంగానికి విశేషమైన సేవలు అందిస్తున్న క్రెడాయి నిర్వాహకులు అభినందనీయులని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి అన్నారు. నగరంలోని ఆరిలోవ ఎంపిపి పాఠశాలలో మంగళవారం టీచర్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా క్రెడాయి విశాఖపట్నం చాప్టర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు, స్టేషనరీ కిట్స్‌ను మేయర్ పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ ఇదే పాఠశాలకు గతంలో విద్యుత్, ప్లంబింగ్ సామగ్రిని క్రెడాయి నిర్వాహకులు అందజేసి ఎంతో మేలు చేశారని గుర్తు చేశారు.

టిడిపి ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని ప్రజలు ఇక నమ్మబోరని మాజీ ఎమ్మెల్యే, టిడిపి దక్షిణ నియోజకవర్గ ఇన్‌ఛార్జి గండి బాబ్జీ అన్నారు. మంగళవారం దక్షిణ నియోజకవర్గం 27వ వార్డులో 'బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం నుంచి తమకు విముక్తి కలిగించాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ గొలగాని వీరారావు (బుజ్జి), టిడిపి వార్డు అధ్యక్షులు అల్లూరి సత్యనారాయణ రెడ్డి, ప్రధాన కార్యదర్శి లక్ష్మీ శివప్రసాద్ పాల్గొన్నారు.